ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
సోమవారం 10 నవంబరు 2025



గ్రామ సభల్లో ఉపాధి పనుల గుర్తింపు

కథలాపూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కొత్తగా చేపట్టబోయే పనులను గ్రామ సభల్లో గుర్తించే క్రియ కొనసాగుతోందని ఈజీఎస్ ఈసీ వెగ్యారపు శ్రీధర్ తెలిపారు. గత వారం రోజులుగా స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్ల నేతృత్వంలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టనున్న పనులను గుర్తించి బడ్జెట్ రూపకల్పన జరుగుతోందని వివరించారు. మండలంలో 9200 జాబ్ కార్డులు ఉండగా 3300 యాక్టివ్‌గా ఉన్నట్టు చెప్పారు. అవెన్యూ ప్లాంటేషన్, ఇంకుడు గుంతలు, గొర్రెల షెడ్‌లు, ఫారం పాండ్లు వంటి పనులు చేపట్టనున్నామన్నారు. కొత్తగా అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానంతో కూలీల హాజరును నమోదు చేయనున్నామని పేర్కొన్నారు.

పరిహారం అందేనా?

- నిండా ముంచిన అధిక వర్షాలు
- సాయం అందక అప్పుల్లో కూరుకుపోతున్న రైతాంగం
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు


మోరపల్లిలో నేల వాలిన వరిపంటను చూపిస్తున్న రైతు (ఫైల్)
గోదూరులో మొక్కజొన్న చేలులో నిలిచిన వర్షపు నీరు (ఫైల్)

జగిత్యాల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలు అన్నదాతలను అతలాకుతలం చేస్తున్నాయి. అతివృష్టి, అనావృష్టి కారణంగా ఏటా ఏదో విధంగా పంటలు నష్టపోతూనే ఉన్నారు. ప్రధానంగా ఈ రెండేళ్ల కాలంలో అతివృష్టి కారణంగా చేతికి వచ్చిన పంటలను రైతులు కోల్పోవలసి వచ్చింది. ఇలాంటి విపత్తుల సమయంలో రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు సకాలంలో పరిహారం అందజేయడం లేదు. ఈ సీజన్‌లో పంట నష్టపోయిన వారికి ఎకరానికి రూ. 10 వేల చొప్పున పరిహారం ఇస్తామని ఇటీవల ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఇంకా అమలుకు నోచుకోవడం లేదు. దీంతో పంటల సాగుకు అయిన పెట్టుబడి కూడా రాకపోవడంతో రైతులు అప్పుల పాలవుతున్నారు. జిల్లాలో సుమారు 4.33 లక్షల ఎకరాల సాగు భూమి ఉండగా దాదాపుగా 2.48 లక్షలకు పైగా రైతులు వ్యవసాయాన్నే నమ్ముకొని పంటలు సాగు చేస్తున్నారు.

● ఫసల్ బీమా లేదు..పరిహారం రాదు

జిల్లాలో పంటల బీమా పథకాలు అసలు అమలు కావడం లేదు. రైతుబంధు అమలు చేస్తున్నామని చెప్పి గత ప్రభుత్వం ఈ పంటల బీమా ఈ


గొల్లపల్లి శివారులో పత్తిచేనులో నిలిచిన వర్షపు నీరు(ఫైల్)

పథకాలకు మంగళం పాడింది. మధ్యలో ఒకసారి ఫసల్ బీమా పథకాన్ని అమలు చేసినా.. మండల యూనిట్‌గా పంటల నష్టాన్ని అంచనా వేయడంతో రైతులకు ఏ మాత్రం మేలు జరగడం లేదని వదిలేశారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే పంట బీమా పథకాన్ని అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ చెప్పినా.. .ఇప్పటివరకు ఫసల్ బీమా అమలు చేయకపోగా పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించడం లేదు.

● 17,982 ఎకరాల్లో వరి పంట నష్టం..

జిల్లా వ్యాప్తంగా ప్రస్తుత వానాకాలం సీజన్‌లో సెప్టెంబరు చివరి వారంలో మొంథా తుఫాను ప్రభావంతో 230 గ్రామాల్లో 16,679 మంది రైతులకు చెందిన 17,982 ఎకరాల్లో వరి పంట నష్టానికి గురైనట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. బీమారం మండలంలో తొమ్మిది గ్రామాల్లో 526 మంది రైతులకు చెందిన 871 ఎకరాలు, మల్యాల మండలంలోని 15 గ్రామాల్లో 925 మంది రైతులకు చెందిన 1,170 ఎకరాలు, పెగడపల్లిలో 17 గ్రామాల్లో 1,432 మంది రైతులకు చెందిన 1,960 ఎకరాలు, రాయికల్‌లో 20 గ్రామాల్లో 1,215 మంది రైతులకు చెందిన 1,122 ఎకరాలు, కొడిమ్యాలలో 15 గ్రామాల్లో 162 మంది రైతులకు చెందిన 275 ఎకరాలు, జగిత్యాల రూరల్‌లో 18 గ్రామాల్లో 284 మంది రైతులకు చెందిన 492 ఎకరాలు, వెల్గటూరులో 13 గ్రామాల్లో 446 మంది రైతులకు చెందిన 681 ఎకరాలు..

(మిగతా 8లో..)

ఆరు సంవత్సరాలుగా పంట నష్టం ఇలా..

	సీజన్..	దెబ్బతిన్న పంటలు (ఎకరాల్లో)
2020	వానాకాలం	10,900
2021	వానాకాలం	30,350
2021-22	యాసంగి	12,930
2022	వానాకాలం	27,123
2023	వానాకాలం	15,487
2023	యాసంగి	26,199
2024	వానాకాలం	12,943
2025	వానాకాలం	17,982

పిల్లర్లు వేశారు ... భవన నిర్మాణం మరిచారు

- అద్దె గృహంలో అరకొర వసతుల మధ్య ఎస్సీ హాస్టల్


పిల్లర్ల దశలోనే నిలిచిన హాస్టల్ భవన నిర్మాణం

పెగడపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్ విద్యార్థులకు అద్దె గృహాల్లో అరకొర వసతుల మధ్యన కాలం వెల్లదీయాల్సి వస్తోంది. మండల కేంద్రంలో ఎస్సీ బాలుర వసతి గృహం దాదాపు 35 ఏళ్లుగా అద్దె గృహాల్లో కాలం వెల్లదీస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హాస్టల్ భవన నిర్మాణానికి రెండు కోట్ల రూపాయలు మంజూరు కాగా నిర్మాణ పనులకు ఎంతో ఆర్భాటంగా శంకుస్థాపన చేశారు. ఆరు నెలల తర్వాత నిర్మాణ పనులు మొదలు కాగా పిల్లర్ల వరకు నిర్మాణం చేపట్టి బిల్లులు రావడం లేదంటూ పనులు అర్ధాంతరంగా వదిలేశారు. దాదాపు ఏడాదిన్నర నుంచి పనులు నిలిచిపోయినా పట్టించుకున్న నాథుడు లేడు. దీంతో పాత పెంకుటింట్లో అరకొర వసతుల మధ్యన హాస్టల్ నిర్వహిస్తుండగా విద్యార్థులు భయంభయంగా కాలం వెల్లదీస్తున్నారు. ఇప్పటికైనా మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ జోక్యం చేసుకుని నిర్మాణ పనులు పూర్తిచేయించి విద్యార్థులకు ఇబ్బందులు తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.


అద్దె గృహంలో కొనసాగుతున్న హాస్టల్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మల్యాల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మల్యాల టౌన్ విద్యుత్ ఫీడర్ లో చెట్ల కొమ్మలు తొలగించడం, మరమ్మతులు జరగనున్న దృష్ట్యా విద్యుత్ సరఫరాకు సోమవారం అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మల్యాల సబ్‌స్టేషన్ పరిధిలోని మల్యాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నవోదయ విద్యాలయంలో పేరెంట్స్ సమావేశం


పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

కోరుట్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో జవహర్ నవోదయ విద్యా లయంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు విద్యలో చూపుతున్న నైపుణ్యాన్ని ఉపాధ్యాయులు వారి వారి తల్లిదండ్రులకు వివరించారు. తల్లిదండ్రుల మీటింగ్‌లో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి స్వాగతం పలికారు. పేరెంట్ కమిటీని ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి తెలిపారు. కమిటీ సభ్యులుగా తిరుమలేష్, మహేష్, స్వప్న, మంజుల, సతీష్‌ను నియమించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడికి సన్మానం

జగిత్యాల అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన హరి అశోక్‌కుమార్‌ను జగిత్యాల జిల్లా సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ తెలంగాణ బీసీ జేఏసీ సంఘాల ప్రతినిధులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ పెన్షనర్స్ వృద్ధుల హక్కుల పరిరక్షణకు హరి అశోక్ కుమార్ రాజీలేని పోరాటం చేస్తున్నారని కొనియాడారు. సీనియర్ సిటిజన్స్ కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, పీసీ హన్మంతరెడ్డి, కొండా లక్ష్మణ్, కస్తూరి శ్రీమంజరి, బొబ్బటి కరుణ, సింగం పద్మ, గంగం జలజ పాల్గొన్నారు.


హరి అశోక్‌కుమార్‌ను సన్మానిస్తున్న సీనియర్ సిటిజన్స్

జిల్లా స్థాయి అథ్లెటిక్స్ లీగ్ పోటీలను విజయవంతం చేయాలి



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న అసోసియేషన్ బాధ్యులు

మెట్‌పల్లి టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మొదటి అస్మిత లీగ్ జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం విజయ్ సాయి పాఠశాల విద్యార్థులు ర్యాలీ తీశారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్యరెడ్డి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 24న జరిగే ఈపోటీలు దేశంలోని 300 జిల్లాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మారుమూల గ్రామీణ బాలికలను క్రీడాకారులుగా తీర్చిద్దిదడానికి ఎంతో ఉపయోగపడుతాయని అన్నారు.

జిల్లాలోని ప్రతిభగల క్రీడాకారులను గుర్తించడానికి లీగ్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రతి జిల్లాలో గుర్తింపు బృందం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే మెట్‌పల్లి మినీ స్టేడియంలో 24న జరిగే అస్మిత లీగ్ పోటీలను పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం మెట్‌పల్లి ప్రధాన రహదారుల వెంబడి తిరుగుతూ విద్యార్థులు ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పుల్ల కపిల్, జిల్లా అథ్లెటిక్స్ ఉపాధ్యక్షులు గజల్ రాందాస్, మర్రిపెల్లి కార్తీక్, పీఈటీలు మధు, భవాని పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


తిప్పయ్యపల్లి జడ్పీ పాఠశాల పూర్వ విద్యార్థులు


రాయికల్‌లోని వివేకవర్ధిని ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

కొడిమ్యాల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పయ్యపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 2004-2005 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. 20 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు గురువులకు శాలువాలను కప్పి సన్మానం చేసారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటు ఒకరితో ఒకరు ఆత్మీయతను పంచుకున్నారు. అనంతరం సహపంక్తి బోజనాలను చేశారు. కార్యక్రమంలో విద్యా బుద్దులు నేర్పిన గురువులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాయికల్: రాయికల్ పట్టణంలోని వివేకవర్ధిని ఉన్నత పాఠశాల 2002-2003 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ రోజంతా ఆనందంగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీపతి రాఘవులు, హెచ్‌ఎం కైరం సత్యం, కట్కం భూమేశ్వర్, పొన్నం రమేష్, ఉపాధ్యాయులు కుందారపు శ్రీనివాస్, రవి కుమార్, రమేష్, మహేష్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి టౌన్: మెట్‌పల్లి పట్టణంలోని శ్రీవాసవి ఉన్నత పాఠశాలకు చెందిన 2007-08 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలతో సందడి చేశారు. ఆనాటి ఉపాధ్యాయులు మనోహర్ శర్మ, ప్రదీప్, వెంకటరమణ, అనంతచారి, సంతోష్, రవి తదితరులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.


మెట్‌పల్లి పట్టణంలోని శ్రీవాసవి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

స్ఫూర్తిదాయక పాఠశాలలు.. క్రమశిక్షణతో విద్య

- విద్యాశాఖ 5.0 అమలుతో మారనున్న పాఠశాలలు - ఈనెల 25 వరకు అభివృద్ధి మార్గదర్శక కార్యక్రమాలు

మెట్‌పల్లి రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్ఫూర్తిదాయకమైన పాఠశాలలో క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడం ద్వారా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోంది. ప్రభుత్వ పాఠశాలలు, విద్యాప్రమాణాలను మెరుగుపరచడానికి విద్యాశాఖ 5.0 సురక్షితమైన, పరిశుభ్రమైన భవనాల్లో విద్యార్థుల శ్రేయస్సు, అభ్యాసాన్ని పెంపొందించడానికి మార్గదర్శకాలు జారీ చేసింది. ఇందులో ప్రధానోపాధ్యాయుడు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ లేక పాఠశాల నిర్వహణ కమిటీ చురుకుగా పాల్గొనేలా చూసుకోవాలి. ఇందులో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సమాజ సేవకులు, దాతలను సేకరించి అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా, భిన్నమైన పద్ధతుల ద్వారా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషిచేస్తోంది. విద్యార్థుల్లోని నైపుణ్యాలను పెంచడమే కాకుండా, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా పాఠశాలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని విద్యాశాఖ అధికారులు తెలుపుతున్నారు.

● షెడ్యూల్ జారీ చేసిన అధికారులు..

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం చేపట్టిన అనేక కార్యాచరణలో భాగంగా 5.0ను ప్రవేశపెట్టి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి మార్గదర్శకాలు జారీచేసింది. పాఠశాలలు క్రమశిక్షణ, అభ్యాస విలువలు ప్రతిబింబించేలా విద్యార్థులకు అనుకూలమైన వాతావరణం కల్పిస్తూ స్ఫూర్తిని కల్పించే విధంగా కళాఖండంతో ఏర్పాటు చేయడం జరుగుతుంది.




కోనరావుపేటలో శిథిలావస్థలో ఉన్న ప్రాథమిక పాఠశాల

విద్యార్థుల శ్రేయస్సు, విద్యా బోధన, పరిసరాల పరిశుభ్రత, పాఠశాల ప్రాంగణాలు, తరగతి గదులు, వంట గదులు, శుభ్రమైన టాయిలెట్లు, ప్రధానంగా శిథిలావస్థకు చేరిన పాత నిర్మాణాలను కూల్చివేయడం, భవన భద్రత, స్క్రాప్‌ను తొలగించడం, పాఠశాల ఆవరణ శుభ్రత, విద్యుత్, మంచి నీటి సౌకర్యం కల్పించడం, దెబ్బతిన్న గోడలను తొలగించడం, ఆరోగ్యం ఇతర మౌలిక వసతులు కల్పించడానికి ప్రభుత్వం ఈనెల 25 వరకు అభివృద్ధి మార్గదర్శక కార్యక్రమాల షెడ్యూలను జారీ చేశారు. కార్యక్రమాలను చేపట్టడానికి కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు మార్గదర్శకాలను జారీ చేశారు.

● మార్గదర్శక కార్యక్రమాలు...

ప్రభుత్వ పాఠశాలలోని సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించిన ప్రభుత్వం అభివృద్ధి ప్రణాళిక కార్యక్రమాలు చేపడుతోంది. ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్య బోధన చేయడానికి ప్రభుత్వం జారీ చేసిన 5.0లోని అభివృద్ధి కార్యక్రమాలను అక్టోబరు 31 నుంచి ఈనెల 25 వరకు చేపట్టడానికి మార్గదర్శకాలు జారీ చేసింది. అందులో ప్రధానంగా దెబ్బతిన్న వస్తువులు, ఉపయోగించని విద్యుత్ పరికరాలు, కలప, లోహం, కాగితం పదార్థాలు వేరు చేసి స్క్రాప్‌గా గుర్తించాలి. వాటిని ఇబ్బందులు కలగకుండా నిల్వ చేయడం, తరగతి గదుల శుభ్ర పరచడం, గోడలకు రంధ్రాలు, పగుళ్లను గుర్తించి మరమ్మతులు చేయించడం, పాఠశాల చుట్టూ డ్రైనేజీ, టాయిలెట్లు, వాష్ రూములను శుభ్రం చేయడం, తాగునీటి ట్యాంకులు, కుళాయిలు, పరిసర ప్రాంత్రాలను శుభ్రపరచడం, విద్యుత్ మరమ్మతులు, ఎండిపోయిన చెట్లు, మొక్కలు, దెబ్బతిన్న తలుపులు, కిటికీలు మార్చడం, చెత్త బుట్టల ఏర్పాటు వంటి వసతులను ప్రధానోపాధ్యాయుడితోపాటు కమిటీ సభ్యులు చూసుకోవాలి. శిథాలావస్థలో ఉన్న నిర్మాణాల కూల్చివేత, పెయింటింగ్, సుందరీకరణ వంటి కార్యక్రమాలను చేపట్టాలని మార్గదర్శకాలను జారీ చేసింది. వీటిని నిర్దేశించిన పనులను గడువులోపు పూర్తి చేసేలా చూడాలని జిల్లా విద్యాశాఖ అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ప్రభుత్వ పాఠశాలలో ఆరోగ్యకరమైన వాతావరణంలో విద్యార్థులకు విద్యాబోధన జరుగనున్నది.

కొత్త భవనాన్ని నిర్మించాలి..

- జక్కని పరందాము, కోనరావుపేట వాసి

గ్రామంలోని పాఠశాల భవనం శిథిలావస్థలో ఉంది. దీంతో వర్షాకాలంలో పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. కొత్త భవనాన్ని నిర్మించాలి. పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. మరో ఉపాధ్యాయుడిని నియమించాలి.

ప్రభుత్వ ఆదేశాలను ఆమలు చేస్తున్నాం...

- చంద్రశేఖర్, మెట్‌పల్లి ఎంఈవో



ప్రభుత్వం జారీ చేసిన 5.0 కార్యక్రమాలను జిల్లా ఉన్నత అధికారుల సూచనలతో పాఠశాలలో ఆమలు చేస్తున్నాము. ప్రణాళికాబద్ధంగా పాఠశాలలో పనులు చేయిస్తున్నాం. మండలంలో శిథిలావస్థలో ఉన్న పాఠశాలను గుర్తించాము. అధికారుల ఆదేశాలతో పనులు చేయిస్తాము.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి


చంద్రమౌళి

ముత్తారం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశనపల్లి గ్రామానికి చెందిన కలవేన చంద్రమౌళి(48) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. శుక్రవారం సాయంత్రం పని నిమిత్తం ముత్తారం వెళ్లి వస్తుండగా కేశనపల్లి గ్రామపంచాయతీ సమీపంలోని మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి కింద పడిపోయాడు. దీంతో అతని తలకు తీవ్రగాయమైంది. కుటుంబ సభ్యులు వెంటనే చంద్రమౌళిని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి, ఆదివారం ఉదయం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వీణవంక, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లూరు మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు ఆదివారం పట్టుకున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ట్రాక్టర్ యాజమానులు పల్లపు వెంకటే, పల్లపు రాజయ్యపై కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

మానకొండూర్: మండలంలోని ఊటూర్ మానేరు వాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను పచ్చునూర్‌లో పట్టుకున్నట్లు స్థానిక సీఐ సంజీవ్ తెలిపారు. మానేరు వాగు నుంచి శనివారం రాత్రి కరీంనగర్ తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

తండ్రిపై కొడుకు దాడి

మెట్‌పల్లి టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తండ్రిపై కొడుకు దాడి చేసిన ఘటన పట్టణంలో ఆదివారం చోటు చేసుకుంది. పట్టణంలోని బోయవాడలో ఎల్లా గంగానర్సయ్యపై అతని కొడుకు అన్వేష్ కర్రతో దాడి చేశాడు. దాడిలో నర్సయ్యకు తీవ్ర గాయాలు కావడంతో అతన్ని స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. దాడికి గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ముత్తారం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖమ్మంపల్లి గ్రామశివారులో శనివారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఖమ్మంపల్లి నుంచి అర్ధరాత్రి ఇసుక కోసం వెళ్తున్న ట్రాక్టర్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడిచర్ల నుంచి వస్తున్న బైక్ ఢీకొన్నాయి. ఇందులో బైక్‌పై ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం మంథని ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి కరీంనగర్‌కు తరలించారు.

ఇవేం కష్టాలు రాజన్నా..


తూర్పు ద్వారం వద్ద భక్తుల రద్దీ

- అడుగడుగునా భక్తుల ఇక్కట్లు
- పూజలు, మొక్కులకు తికమక

వేములవాడ టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం సందర్భంగా రాజన్న దర్శనానికి వచ్చిన భక్తుల కష్టాలు చెప్పనలవికాదు. ఆదివారం రాజన్న దర్శనానికి వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. ఇటు రాజన్న, అటు భీమన్న సన్నిధిలో భక్తులు దర్శించుకోవాల్సి రావడంతో తికమకపడ్డారు. ఏ పూజలు ఎక్కడ చేయాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. వివిధ ప్రాంతాల నుంచి వేములవాడకు చేరుకున్న భక్తులు ఎటువైపు వెళ్లాలో తెలియక ఇబ్బందులు పడ్డారు. కోరిన కోర్కెలు తీరాలంటూ మొక్కులు చెల్లించుకున్న భక్తులకు కష్టాలు తప్పడంలేదు. రాజరాజేశ్వరస్వామివారి దర్శనానికి రాజగోపురం నుంచి ప్రవేశం కల్పించారు. స్వామి వారిని సాధారణ(లఘు)దర్శనమే చేసుకోవడానికి గంటల తరబడి క్యూలైన్‌లో వేచి ఉండక తప్పలేదు.


ఆలయ ప్రధాన ద్వారం వద్ద రద్దీగా ఉన్న భక్తులు

రద్దీ అధికంగా ఉండడంతో ఒకే మార్గం నుంచి అనుమతి ఇవ్వడంతో ఇబ్బందులు ఎదుర య్యాయి. రాజగోపురం ఎదురుగా ఉన్న రావి చెట్టుకు ఇరువైపులా భక్తులు లోనికి వెళ్లేందుకు ప్రయత్నించారు. మరోవైపు తూర్పు వైపు ఉన్న క్యూలైన్‌లోనూ స్వామివారి దర్శనానికి బారులు తీరారు. రాజగోపురం ఎదురుగా బారికేడ్లు తాళం వేసి ఉన్నప్పటికీ భక్తులు స్వామివారి దర్శనానికి నిరీక్షించడంతో ఒక్కసారిగా తోయడం వల్ల గేటు ఊడిపోయింది. ఇకపోతే భీమేశ్వరాలయం వద్ద భక్తులు ఇక్కట్లు నెలకొన్నాయి. ఆర్జిత సేవల టికెట్లు తీసుకునేందుకు ఎటు వెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొంది. బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించడం భక్తులకు గగనమైంది. బోనం సమర్పించేందుకు గంటల తరబడి నిరీక్షణ తప్పడంలేదు.

తగ్గిన కల్యాణం టికెట్లు సంఖ్య..

రాజరాజేశ్వరస్వామి ఆలయ విస్తరణ పనుల నేపథ్యంలో స్వామివారి లఘు దర్శనం మాత్రమే కల్పించి భీమేశ్వరాలయంలో ఆర్జిత సేవలకు అవకాశం కల్పించారు. దీంతో అంతకుముందు నిత్య కల్యాణానికి ప్రతిరోజు 150, సత్యనారాయణ వ్రతా లకు 100 టికెట్లు ఇచ్చేది. ప్రస్తుతం అన్నదాన స త్రంపై అంతస్థులో నిత్యకల్యాణం, సత్యనారాయణ వ్రతాలు నిర్వహించడంతో హాలు ఇరుకుగా ఉంది. దీంతో కేవలం 70 నిత్యకల్యాణం, 50 సత్యనారా యణ వ్రతాల టికెట్లు విడుదలకు కుదించారు. మిగి తా భక్తులు కళ్యాణం, సత్యనారాయణ వ్రతాలు చేసుకోలేక తిరుగుముఖం పడుతున్నారు. ఆదివారం 69మంది దంపతులు కల్యాణం, 32మంది దంప తులు సత్యనారాయణ వ్రతాలు చేసుకున్నారు. ఆ ర్జిత సేవలైన కల్యాణం, సత్యనారాయణ వ్రతాల టికె ట్లు తగ్గించడంతో భక్తులకు తిప్పలు తప్పడంలేదు.


కల్యాణం జరిగే హాలులో స్థలం లేక బయట ఉన్న భక్తులు

హెల్ప్‌డెస్క్ ఎక్కడ?

రాజన్న సన్నిధిలో విస్తరణ పనుల నేపథ్యంలో ఆర్జిత పూజలు భీమేశ్వరాలయానికి మార్చిన సందర్భంగా హెల్ప్‌డెస్క్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఇంతకు ముందు ఆర్జిత సేవలన్నీ రాజన్న ఆలయంలో జరిగినందున భక్తులకు యథావిధిగా ఎక్కడ ఏ మొక్కులు చెల్లించాలో తెలిసేది. ప్రస్తుతం ఆర్జిత పూజలు, కోడెల మొ క్కులు భీమన్న ఆలయానికి మారినపుడే రాజన్న ఆలయం వద్ద, భీమన్న ఆలయం వద్ద హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఏ పూజలు ఎక్కడ జరు గుతాయని, ఏ పూజకు టికెట ధర ఎంత తదితర సమాచారం తెలిసేందుకు వీలుగా పలుచోట్ల హెల్ప్‌డెస్స్ ఉంటే భక్తులకు సౌకర్యంగా ఉంటుంది.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

- గుంత తీస్తుండగా విద్యుదాఘాతంతో ఒకరి మృతి

బీర్‌పూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని కండ్లపల్లి గ్రామంలో శనివారం రాత్రి గుప్త నిధుల తవ్వకాలు ఓ నిండు ప్రాణాన్ని బలిగొన్నాయి. నిధులను వెలికి తీసేందుకు ఓ ఇంటిలో గుంత తవ్వుతుండగా ప్రమాదవశత్తు విద్యుదాఘాతంతో నారవేణి మొగిళి(51) అనే వ్యక్తి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జగిత్యాల రూరల్ సీఐ సుధాకర్, బీర్‌పూర్ ఎస్సై రాజు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. బీర్‌పూర్ మండలంలోని కండ్లపల్లి గ్రామానికి చెందిన శ్రీరాముల నవత-మల్లేశ్ దంపతులు తమ ఇంట్లో గుప్త నిధులు ఉన్నాయని, వాటిని తీయాలని అనంతారం గ్రామానికి చెందిన నారవేణి మొగిళి(51), గోవింద్‌పల్లె గ్రామానికి చెందిన వరికొప్పుల సోమయ్య, దమ్మన్నపేట గ్రామానికి చెందిన బైరవేణి రాజును కోరారు. శనివారం రాత్రి ముగ్గురు వ్యక్తులు నవత ఇంట్లో సుమారు ఎనిమిది ఫీట్ల లోతు గల గుంతను తీశారు. ఏమీ లభించకపోవడంతో గుంత నుంచి పైకి ఎక్కే క్రమంలో నారవేణి మొగిళి చెయ్యి కరెంటు బోర్డుకు అమర్చిన ఫ్యూజు వైరుకు తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. మొగిళిని అంబులెన్స్‌లో జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మొగిళి భార్య నారవేణి లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు జగిత్యాల రూరల్ సీఐ సుధాకర్ తెలిపారు.


గుప్త నిధుల కోసం తవ్విన గొయ్యి

విద్యుదాఘాతంతో ఆవు మృతి

బోయినపల్లి నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బోయినిపల్లి మండలం స్తంభంపల్లిలో విద్యుదాఘాతంతో ఆవు మృతిచెందింది. స్తంభంపల్లి గ్రామంలోని ముత్యపు పరశురాం అనే రైతుకు చెందిన ఆవు వ్యవసాయ పొలంలో ఇనుప స్తంభానికి తగలడంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందింది. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం మూలంగానే ఆవు మృతి చెందిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఆవు మృతితో రైతుకు నష్టం వాటిల్లిందని, బాధితుడికి ప్రభుత్వం ఆర్థికం గా ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.


విద్యుదాఘాతంతో మృతిచెందిన ఆవు

బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీ

- ఇద్దరు పాలిటెక్నిక్ విద్యార్థుల దుర్మరణం


మణిచరణ్ , శశికుమార్ (ఫైల్)

వేములవాడ టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొనడంతో ఇద్దరు విద్యార్థులు దుర్మరణం చెందారు. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం... వేములవాడ అర్బన్ మండలంలోని అగ్ర హారం వద్ద ఆదివారం అతివేగంగా వస్తున్న ద్విచక్రవాహనం చెట్టుకు ఢీకొంది. ఈ ప్రమాదంలో అగ్రహారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా చదువుతున్న ఇద్దరు విద్యార్థులు మృతిచెందారు. జగిత్యాల జిల్లా మేడిపల్లి మండల కేంద్రానికి చెందిన కుడికందుల రవీందర్ ఏకైక కుమారుడు మణిచరణ్ (18) అక్కడికక్కడే మృతిచెందగా, సిరిసిల్ల పట్టణం రగుడు గ్రామానికి చెందిన బూర లక్ష్మి, భూమయ్యల ఏకైక కుమారుడు శశికుమార్(18) తీవ్రగాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. అగ్రహారంలో అద్దెకు ఉంటున్న మణిచరణ్ సెలవురోజు కావడంతో సిరిసిల్ల పట్టణం రగుడులో ఉండే తన స్నేహితుడైన శశికుమార్ వద్దకు వెళ్లాడు. ద్విచక్ర వాహనంపై ఇద్దరు స్నేహితులు కళాశాల వైపు అతివేగంగా వస్తుండగా బైక్ అదుపు తప్పి చెట్టుకు ఢీకొంది. ఈ ప్రమాదంలో కుడికందుల మణిచరణ్ అక్కడికక్కడే మృతిచెందగా, బూర శశికుమార్‌కు తీవ్రగాయాలు కావడంతో చికిత్స కోసం కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. అగ్రహారం రాజరాజేశ్వర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మణిచరణ్ డిప్లొమా ద్వితీయ సంవత్సరం, శశికుమార్ డిప్లొమా మొదటి సంవత్సరం చదవి డిటెండ్ అయ్యాడు. ఇద్దరు స్నేహితులు మృతిచెందడంతో రెండు కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇద్దరు కుటుంబంలో ఏకైక కుమారులే కావడంతో కుటుంబ సభ్యులు , స్నేహితులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని మృతదేహాలను పోస్టుమార్టం తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి

హుజూరాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అనుమానాస్పద స్థితిలో ఓ వృద్ధురాలు మృతి చెందింది. పట్టణంలోని ప్రతాపవాడకు చెందిన పంపిరి పద్మ (70) అనే వృద్ధురాలు అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. ఆమె భర్త ఎక్సైజ్ శాఖలో ఉద్యోగం చేసి మృతి చెందగా, కొడుకు, కూతురు ఉన్నారు. ఆదివారం కరెంటు బిల్లు కొట్టేందుకు వచ్చిన ట్రాన్స్‌కో ఉద్యోగికి ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో చుట్టూ పక్కల వారికి విషయం తెలిపాడు. స్థానికులు తలుపులు తెరిచి చూడగా వృద్ధురాలి మృతదేహం కనిపించింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కొడుకుకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. కూతురుకు సమాచారం అందించారు. కాగా వృద్ధురాలు మృతికి గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత



బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు

మల్యాల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి దర్శనానికి వచ్చిన ఓ బాలుడు తప్పిపోగా పోలీసులు వెతికి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన కిషోర్‌కుమార్ కుటుంబ సమేతంగా ఆదివారం ఆంజనేయస్వామి దర్శనానికి వచ్చారు. దర్శనం చేసుకునే సమయంలో వారి రెండున్నరేళ్ల కుమారుడు హరినాథ్ తప్పిపోయాడు. దీంతో బాలుడి తల్లిదండ్రులు స్థానిక అవుట్‌పోస్టు పోలీసులకు సమాచారం అందించారు. బాలుడిని వెతికి పట్టుకొని మైక్ ద్వారా అనౌన్స్ చేసి విచారణ జరిపిన అనంతరం ఏఎస్సై చిలుక శ్రీనివాస్ బాలుడి తల్లిదండ్రులకు అప్పగించారు.

వసతి గృహం పరిసరాల్లో ఎలుగుబంటి సంచారం

ఇల్లంతకుంట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గాలిపెల్లి గ్రామంలోని ఎస్సీ బాలుర వసతిగృహ పరిసరాల్లో ఎలుగుబంటి సంచరించింది. హాస్టల్ సమీపంలో పత్తిచేన్లు ఉండటం పక్కనే బైపాస్ రోడ్డు ఉంది. రోడ్డు వెంబట ఆదివారం ద్విచక్రవాహనంపై ఇరువురు వస్తుండగా ఎలుగుబంటి రోడ్డు పక్కనే కనిపించింది. గ్రామస్థులకు సమాచారం అందివ్వగా తాటికమ్మలను అంటుబెట్టుకొని వెళ్లగా పత్తిలోకి ఎలుగుబంటి పరుగులు తీసింది. రెండు సంవత్సరాలుగా గాలిపెల్లి, పారువెల్ల గ్రామాల పరిసరాల్లో ఎలుగుబంటి తిరుగుతోందని, అటవీశాఖ అధికారులు స్పందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

యువకుడి ఆత్మహత్య


వెంకటేశ్(ఫైల్)

తంగళ్లపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావ్‌పల్లె గ్రామానికి చెందిన ఎడ్ల వెంకటేష్(23) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువుల కథనం.. గ్రామానికి చెందిన వెంకటేష్ కొద్ది రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. చికిత్స చేయించుకున్నప్పటికీ తిరిగి అనారోగ్యానికి గురికావడంతో శనివారం అర్ధరాత్రి ఇంట్లోని బాత్‌రూంలో పరుగుల మందు తాగాడు. గమనించిన తల్లి వసంత, బంధువులు వెంకటేష్‌ను జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తుండగా ఆదివారం మృతిచెందాడు. మృతుడు ఎంబీఏ పూర్తి చేసి వ్యవసాయ పనులు చేసుకుంటూ పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్నాడు. ఈ క్రమంలో అనారోగ్యానికి గురి కావడంతో మనస్థాపంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు.

కొండచిలువ హతం



బోయినపల్లి నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బోయినిపల్లి మండలం రత్నంపేట గ్రామంలో ఆదివారం కొండచిలువ ప్రత్యక్షమై కలకలం సృష్టించింది. గొర్రెలను మేపేందుకు పచ్చిగడ్డి కోసం వెళ్లగా కొండచిలువ రావడంతో ఒక్కసారిగా భయబ్రాంతులకు గురై పరుగులు తీశారు. దీంతో గొర్రెల కాపరులు కొండచిలువను చంపి వేశారు.

రేకులు మీదపడి వృద్ధురాలి మృతి


అంతగిరి లక్ష్మి(ఫైల్)

ఓదెల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలనూర్‌లో ఆదివారం అంతగిరి లక్ష్మి(65) అనే వృద్ధురాలు రేకులు మీద పడి మృతిచెందింది. పాతభవనం ముందు సజ్జలపై నుండి నీడ కోసం రేకులు అమర్చుకున్నారు. ఇంటిముందు లక్ష్మి కూర్చున్న సమయంలో అకస్మాత్తుగా సజ్జలు విరగడంతో రేకులు మీదపడి వృద్ధురాలు అక్కడికక్కడే మృతిచెందింది. ఈ మేరకు మృతురాలి కుమారుడు సదయ్య అలియాస్ బుచ్చిమల్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పొత్కపల్లి ఎస్ఐ దీకొండ రమేష్ తెలిపారు.

రంగరావుపేటలో సీసీఎంబీ శాస్త్రవేత్తల పర్యటన

మెట్‌పల్లి రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రంగరావుపేట గ్రామంలో సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యూలర్ బయాలజీ హైదరాబాద్ శాస్త్రవేత్తలు ఆదివారం పర్యటించి పాముకాటుతో మరణించిన వారి వివరాలను సేకరించారు. గ్రామంలో ఇదివరకు పాము కాటు గురై మృతి చెందిన వివరాలతో పాటు ఆరోగ్య సమస్యల గురించి మండల వైద్యాధికారి అంజిత్‌రెడ్డితో కలిసి వారి ఇంటికి వెళ్లి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాము కాటేయగానే చాలా మంది కంగారు పడతారని అలా చేయడం వలన భయం ఎక్కువై గుండె వేగంగా కొట్టుకొని విషం శరీంలో త్వరగా పాకే అవకాశం ఉంటుందన్నారు. బాధి తుడు ప్రశాంతంగా ఉండి కాటు వేసిన పామును గుర్తించి అది ఏ రంగులో ఉంది, సైజు, తల అకారం లాంటివి గమనించి వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలని తెలిపారు. విషం శరీరంలో వేగంగా పాకకుండా ఉండాలంటే కాటు వేసిన భాగాన్ని స్థిరంగా ఉంచాలన్నారు. డాక్టర్లకు పాము గురించి తెలిపితే వారు త్వరగా ట్రీట్‌మెంట్ చేయడానికి వీలు ఉంటుందని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి అంజిత్‌రెడ్డి, సీసీఎమ్ బీ చీఫ్ సైంటిస్టులు కార్తికేయన్, సుమిత్, బృందం శ్రీనివాస్, స్వప్నిల్, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.



పాము కాటు వివరాలు సేకరిస్తున్న సీసీఎమ్‌బీ శాస్త్రవేత్తలు

మట్టి తవ్వకాన్ని అడ్డుకున్న గ్రామస్థులు


కేశవపట్నంలో ట్రాక్టర్లలో తరలిస్తున్న మట్టి

శంకరపట్నం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కేశవపట్నం శివారులో అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిని రైతులు అడ్డుకున్నారు. గ్రామస్థుల వివరాల మేరకు ఇటీవల కురిసిన అకాల వర్షాలకు సైదాపూర్ మండలంలో ధ్వంసమైన రోడ్లను మరమ్మతు చేయడానికి కేశవపట్నం శివారులోని మంగల్ మెట్టు వద్ద ఎక్స్‌కావేటర్ సహాయంతో కాంట్రాక్టర్ మట్టి తరలిస్తున్నాడు. విషయం తెలిసిన గ్రామస్థులు అడ్డుకున్నారు. మట్టి తవ్వకంపై వివరణ అడగడానికి వెళ్లగా ఆర్‌అండ్‌బీ వర్క్ ఇన్‌స్పెక్టర్ కాంట్రాక్టర్ మట్టి తవ్వకాలు నిలిపివేసి వెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు.

తేజస్ అకాడమీలో అగ్నిప్రమాదం


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కరీంనగర్ క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి తేజస్ అకాడమీలో ఆదివారం అగ్నిప్రమాదం జరిగి రెండు కుర్చీలు కాలిపోయాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అకాడమీలోని కార్యాలయం గదిలో మంటలు అంటుకోగా సిబ్బంది వెంటనే సమాచారం అందించటంతో కరీంనగర్ అగ్నిమాపకశాఖ స్పందించి ఫైరింజన్‌తో సంఘటనాస్థలానికి చేరుకుని మంటాలను అదుపులోకి తీసుకు వచ్చింది. ఈ ప్రమాదంలో స్వల్పంగా నష్టం జరిగిందని జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి ఎం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

చంద్రంపేట చౌరస్తాలో తృటిలో తప్పిన ప్రమాదం

సిరిసిల్ల రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చంద్రంపేట చౌరస్తాలో శనివారం అర్ధరాత్రి ఓ కారు అదుపుతప్పి గుంతలో పడి డివైడర్‌ను ఢీకొట్టడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. చంద్రంపేట శివారులో ఉన్న కల్యాణ మండపంలో పట్టణానికి చెందిన వ్యాపారి కుమార్తె వివాహం జరిగింది. ఆ వివాహానికి సంబంధించిన కారులో సామగ్రిని ఇంటికి తరలిస్తుండగా చంద్రంపేట చౌరస్తాలో ప్రమాదకరంగా ఉన్న గుంతను గమనించకపోవడంతో కారు అందులో పడి అదుపుతప్పి పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొంది. ఆదివారం ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ప్రమాదానికి గురైన కారును తొలగించారు.


సిరిసిల్ల చంద్రంపేటలో ప్రమాదానికి గురైన కారు

బైక్‌పై నుంచి కింద పడి మహిళకు గాయాలు

- పోలీసుల నుంచి తప్పించుకునే క్రమంలో ఘటన

చందుర్తి నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బైక్‌పై నుంచి ఓ మహిళ కింద పడి గాయాలైన సంఘటన చందుర్తి మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం కథలాపూర్ మండలం బొమ్మెన గ్రామానికి చెందిన లంకదాసరి దేవదాసు అనే వ్యక్తి తన భార్య లక్ష్మి, బంధువులు కలిసి వేములవాడకు వెళ్లి తిరిగి కోరుట్లకు వెళ్తున్నాడు. దేవదాసు దివ్యాంగుడు కావడంతో అతను ఒక్కడే తన వాహనంపై వెళ్తూ బంధువులకు చెందిన మరో బైక్‌పై తన భార్య లక్ష్మి వెళ్తుతున్నది. చందుర్తిలో పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా వాహనాన్ని ఆపినట్లు ఆపి, బైక్‌ను ఒక్కసారిగా ముందుకు కదిలించడంతో అదుపు తప్పి మహిళ కింద పడింది. దీంతో ముందు వెళ్లిన భర్త తిరిగి వచ్చి పోలీసులు పడగొట్టారని గొడవకు దిగడంతో అక్కడున్న వారు ద్విచక్ర వాహనదారుని తప్పని అని చెప్పడంతో, లక్ష్మిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో వేములవాడ ఏరియా అసుపత్రికి తరలించారు. ఈ విషయమై ఎస్సై రమేష్‌ను వివరణ కోరగా పోలీసుల తనిఖీల నుంచి తప్పించుకోవడానికి బైకును ఒక్కసారిగా రోడ్డుకు కిందకు దించి వెళ్లే క్రమంలో వెనుక కూర్చున్న మహిళ అదుపు తప్పి కింద పడిపోయిందని తెలిపారు. పోలీసులు వాహనాన్ని కూడా ఆపలేదన్నారు.

ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్

గంగాధర, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గంగాధరలో ఉమ్మడి జిల్లా స్థాయి వీకెండ్ ఒపెన్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్‌లో 8 ఫ్రాంచైజీ జట్లు పాల్గొంటున్నట్లు నిర్వహాకుడు రాగూర్ తెలిపారు. ఆదివారం జరిగిన ప్రారంభ మ్యాచ్‌లో రాయల్ వేములవాడ జట్టు సుప్రాక్రికెట్ ఆకడమీ జూనియర్స్‌పై 170 పరుగులతో గెలుపొందింది. ఈ టోర్నమెంటును మాజీ ఎంపీపీ శ్రీరాం మధుకర్, సింగిల్ విండో ఉపాధ్యక్షుడు వేముల భాస్కర్, మాజీ సర్పంచ్ వేముల లావణ్య అంజీ, గంగాధర క్రికెట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రాజన్న సన్నిధిలో శిథిలాల తొలగింపు



వేములవాడలో శిథిలాలను తొలగిస్తున్న ఎక్స్‌కావేట్

వేములవాడ టౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో విస్తరణ పనుల నేపథ్యంలో కూల్చివేసిన పాత భవనాల శిథిలాల తొలగింపు ప్రక్రియ మొదలైంది. ఆదివారం ఆలయం వద్ద రెండు ఎక్స్‌కవేటర్లను ఏర్పాటు చేసి శిథిలాలను తరలిస్తున్నారు. రాజన్న సన్నిధిలో రూ. 76కోట్లతో విస్తరించేందుకు అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. ఇందుకు గతంలో ఉన్న పాత భవనాలైన కళాభవన్, పరిపాలన భవన్, వంతెనలు కూల్చివేశారు. ఈ కూల్చివేసిన సందర్భంగా ఏర్పడిన శిథిలాలన్నీ తొలగించేందుకు పనులు వేగవంతం చేశారు. ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో రావడంతో కొంత ఇబ్బందులు నెలకొన్నాయి.

తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక

కరీంనగర్‌టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం నగరంలోని సంఘం భవనంలో రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకన్న ఆదేశాల మేరకు బొద్దుల గంగయ్య ఎన్నికల అధికారిగా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లా సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిందం శ్రీనివాస్, సహాధ్యక్షులుగా దీకొండ భూమయ్య, వొడ్నాల చంద్రమౌళి, ఉపాధ్యక్షులుగా మిట్టపల్లి రాజేంద్రప్రసాద్, దూస రాజశేఖర్, ఆడెపు రాజేంద్రప్రసాద్, దాసరి రాజమల్లు, కొలిపాక కావ్య, ప్రధాన కార్యదర్శిగా వంగ రవీందర్, కోశాధికారిగా మంచికట్ల రవి, సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్ వేముల జమున, జల్దా భూమేశ్వర్, గట్టు రమేశ్, కొండ వెంకటరాజం, సంస్థాగత కార్యదర్శిగా కూరపాటి వెంకటరమణ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి గంగయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

కార్యనిర్వాహక కార్యదర్శులుగా గుండెల్లి లక్ష్మీనర్సయ్య, మేర్గు వెంకటరమణ, గుడ్ల మమత, ప్రచార కార్యదర్శులుగా బాషబత్తిని కుమార స్వామి, దూసశ్రీనివాస్, ఆఫీస్ కార్యదర్శి దిడ్డి ప్రదీప్, కార్యవర్గసభ్యులుగా వెంగల రవీంద్రనాథ్, గూడూరి రాజు, భైరి మార్కండేయ, గడ్డం బుచ్చన్న, చిమ్మని చంద్రశేఖర్, చిలుక మనోహర్‌ను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

- మందుబాబులకు అడ్డాగా మారిన వైనం
- ప్రభుత్వం స్పందించాలని కళాకారుల విజ్ఞప్తి



వేములవాడలో కళావిహీనంగా మారిన సినారె భవన్

దయనీయ స్థితిలో 'సినారె' కళామందిర్

వేములవాడ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మూలవాగు ఖ్యాతిని చాటిచెప్పిన జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డి (సినారె) తగినంత గౌరవం దక్కడం లేదని కళాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేములవాడ ప్రాంతంలోని కళాకారుల ప్రతిభను గుర్తించేందుకు, కళా ప్రదర్శనలు ఇచ్చేందుకు నిర్మించిన సినారె కళా మందిరం దయనీయస్థితిలో దర్శనమిస్తోంది. వేములవాడ మండల పరిషత్ ఆవరణలో నిర్మించిన సినారె కళామందిర్ ఎంపీడీవో ఆధ్వర్యంలో కొనసాగుతుండేది. ఎన్నో ఏళ్లుగా సినారె కళామందిర్ ఆలనాపాలన లేకపోవడంతో శిథిలావస్థకు చేరకుంది. వేములవాడ మున్సిపల్ కార్యాలయంలోని వాహనాలకు, ఆటోలకు అడ్డాగా మారింది. సినారె కళామందిర్ చెత్తాచెదారంతో నిండిపోయింది. వెంటిలేటర్లు పూర్తిగా పగిలిపోయి దర్శనమిస్తున్నాయి. అసాంఘిక కార్యకలాపాలు, మందుబాబులకు అడ్డాగా మారడంతో వాడిపడేసిన మందుబాటిళ్లు, గ్లాసులు, పేపర్ ప్లేట్లతో దుర్వాసన వస్తోందని కళాకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిధులు మంజూరైనా..

కళామందిర్ నూతన భవన నిర్మాణం చేపట్టేందుకు గత ప్రభుత్వం హయాంలో అప్పటి ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్‌బాబు ఆధ్వర్యంలో టీయూఎఫ్ఐడీ నిధులు రూ.5కోట్లు మంజూరైనట్లు ప్రకటించారు. అయితే నూతన భవన నిర్మాణానికి రూ.5 కోట్లు నిధులు సరిపోవని కాంట్రాక్టరులు ఎవరు ముందుకు రాకపోవడంతో మంజూరైన నిధులను ఇతర అభివృద్ధి పనులకు మళ్లించారనే ఆరోపణలు ఉన్నాయి.



చెత్తచెదారంతో అధ్వానంగా మారిన సినారె కళామందిర్

ప్రభుత్వంపై ఆశలు..

డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డి రాజ్యసభ సభ్యుడిగా ఉన్న సమయంలో 2005లో 'సినారె కళా మందిర్'ను నిర్మించారు. సినారె పేరు చిరకాలం గుర్తుండిపోయేలా అప్పట్లోనే సకల హంగులతో కళామందిర్ నిర్మాణం చేపట్టారు. ఈప్రాంత కవులు, కళాకారులు, సాహితీవేత్తలతో పాటుగా సమస్త కళాకారుల ప్రతిభను గుర్తించి అన్ని స్థాయిల్లో రాణించాలనే ఆకాంక్షతోనే కళామందిర్ నిర్మించారు. అయితే గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో సినారె భవనాన్ని పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్న సినారె కళామందిర్‌ను పట్టించుకోవడం లేదని కళాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవ తీసుకుని నూతన భవన నిర్మాణం చేపట్టాలని కళాకారులు, కవులు కోరుతున్నారు.

ప్రభుత్వంపైనే ఆశలు..

- వారాల దేవయ్య, ఉద్యమ కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు



గత ప్రభుత్వ పదేళ్ల పాలనలో సినారె భవనాన్ని పట్టించుకోలేదు. ప్రస్తుత ప్రభుత్వం చొరవ తీసుకుని సినారె భవనానికి నిధులు మంజూరు చేసి నూతనంగా నిర్మాణం చేయాలి. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చొరవ తీసుకొని కళామందిర్‌కు పూర్వవైభవం తీసుకురావాలని కోరుతున్నాం.

శ్రీరాంసాగర్‌కు 9,454 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

జగిత్యాల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఆదివారం స్వల్పంగా వరద వచ్చింది. ఎగువ ప్రాంతం నుంచి 9,454 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా కాకతీయ కాలువ, సరస్వతీ కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 9,454 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి వంద క్యూసెక్కుల నీటి విడుదల

ఇల్లంతకుంట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగుతోంది. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.41టీఎంసీల నీరు ఉంది. అన్నపూర్ణ రిజర్వాయర్ సర్‌ప్లస్ గేట్ల ద్వారా 100క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలకు ఎంపిక



ప్రహర్షిక

మానకొండూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలకు మండలంలోని పోచంపల్లి ఆదర్శ పాఠశాలకు చెందిన ప్రహర్షిక ఎంపికైంది. ఈ నెల 3న హుజూరాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్-14 బాలికల విభాగంలో ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలో ప్రతిభ కనబరిచింది.

పెద్దపల్లిలో ముగిసిన రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు

పెద్దపల్లి కల్చరల్, నవంబరు9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మూడు రోజుల పాటు జరిగిన 58వ రాష్ట్ర సీనియర్ ఇంటర్ జిల్లా ఖోఖో చాంపియన్ షిప్ పోటీలు ఆదివారం ముగిసాయి. ఈ పోటీలను జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఖోఖో అసోసియేషన్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ, తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వచ్చిన మహిళలు, పురుష జట్లు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. విజేతలకు ట్రోఫీలు, సర్టిఫికెట్లు నిర్వాహకులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఇంత పెద్దస్థాయి పోటీలు పెద్దపల్లిలో నిర్వహించడం, విజయవంతంగా జరగడం సంతోషదాయకమన్నారు.

17న ఛలో ఢిల్లీకి తరలిరండి

కథలాపూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన ప్రధాన న్యాయ మూర్తి గవాయ్‌పై దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ ఈ నెల 17 నిర్వహించనున్న దళితులు ఆత్మగౌరవ సభ ఛలో ఢిల్లీకి తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి కాశవత్తు లక్ష్మీరాజం కోరారు. ఆదివారం కథలాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ దాడి జరిగి దాదాపు నెల రోజులు కావస్తున్నా నేటికీ ఈ కేసును సుమోటోగా స్వీకరించక పోవడం దారుణమని అన్నారు. మేధావులు, దళిత సంఘాలు, పార్టీలకతీతంగా నాయ కులు సభకు హాజరై విజయవంతం చేయా లని కోరారు. ఈ సందర్భంగా గజ్జెల దశరథం, నితిన్, కిరణ్, ప్రభు, నవదీప్, సాయి, భూమేశ్ తదితరులు ఉన్నారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోండి..



- నేడు ప్రపంచ రోగ నిరోధక దినోత్సవం

సుభాష్‌నగర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): టీకాల ప్రాధాన్యంపై అవగాహన పెంచడానికి ప్రపంచ రోగ నిరోధక దినోత్సవాన్ని పాటిస్తున్నారు. వ్యాధిని నివారించడలో, ప్రజారోగ్యాన్ని పరిరక్షించడంలో టీకాల ప్రాధాన్యం ఎంతగానో ఉంది. తీవ్రమైన అనారోగ్యం, వైకల్యం, మరణానికి కారణమయ్యే అంటువ్యాధులను నివారించడం ద్వారా టీకాలు వేస్తారు.

● రోగ నిరోధకతకు ప్రాధాన్యం

శరీర రోగనిరోధక వ్యవస్థను మెరుగుపరచడానికి టీకాలు ఉపయోగపడతాయి. ఇవి వ్యాధుల నుంచి రక్షణ అందిస్తాయి. వ్యాక్సిన్ల అభివృద్ధి ఆరోగ్య సంరక్షణలో కీలకంగా మారింది. సకాలంలో టీకాలు తీసుకోవడం వల్ల వ్యాధులు వ్యాప్తిచెందకుండా నిరోధించవచ్చని డాక్టర్లు సూచిస్తున్నారు. కొవిడ్-19 మహమ్మారి వంటి కొత్త ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్న తరుణంలో సమగ్ర టీకా కార్యక్రమాల అవసరం గతంలో కంటే పెరిగింది. చిన్నపిల్లలకు సాధారణ టీకాలతో పాటు బూస్టర్ మోతాదులు, పెద్దలకు టీకాలు, రోగాల నుంచి రక్షించడానికి సహాయపడతాయి.

● వ్యాక్సిన్- నివారించగల వ్యాధులు

మన దేశంలో టీకాలతో నివారించగల వ్యాధులు ఎక్కువగా ఉన్నాయి. అందులో పోలియో ఒకటి. 2014లో విస్తృత ప్రయత్నాల ద్వారా పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంతో నేడు భారత దేశం పోలియో రహిత దేశంగా ప్రకటించబడింది. లక్షలాది మందిని ప్రభావితం చేస్తున్న హెపటైటీస్-బి ఒక సవాల్‌గా మారింది. హెపటైటీస్ వ్యాక్సిన్ చేయించడం వల్ల ఈ వ్యాధి తగ్గుముఖం పడుతుంది. డిఫ్తీరియా అనేది తీవ్రమైన బాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్. ఇది శ్వాసకోశ వైఫల్యం, ఒక్కోసారి ప్రాణాంతకంగా మారుతుంది. దీనిని నివారించడానికి డీటీపీ (డిఫ్తీరియా, టెటనస్, పెర్టసిస్) టీకాలు వేస్తున్నారు. ధనుర్వాతం ఆందోళనకరమైంది. ఇన్‌ఫెక్షన్లు ఎక్కువగా ఉండే గ్రామీణ ప్రాంతాలు, నవజాత శిశువులు, ధనుర్వాతానికి దారి తీసే గాయాలతో బాధపడుతున్న వ్యక్తులకు టీకాలు వేయడం చాలా అవసరమని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. క్షయవాది (టీబీ)కి బీసీజీ వ్యాక్సిన్ ఉన్నది.

బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీడీ వర్కర్స్ నాయకులు

మెట్‌పల్లి టౌన్, నవంబరు9(ఆంధ్రజ్యోతి): దేశాయి బ్రదర్స్ బీడీ కంపెనీ కార్మికులపై కొనసాగుతున్న అన్యాయాలను ఖండిస్తూ రాష్ట్ర ప్రగతిశీల వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానికంగా పలువురు కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కంపెనీ ఎదుట యూనియన్ నాయకులు పోస్టర్లను ఆవిష్కరించారు. కంపెనీ ప్రతి వెయ్యి బీడీలకు రూ.10 చెల్లించడం చట్ట వ్యతిరేకమని, ఈ మొత్తం వెంటనే కార్మికులకు తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు సత్తక్క, రాధక్క, వినీత, శ్యామల, బాలయ్య, సునీతతోపాటు పలువురు బీడి కార్మికులు పాల్గొన్నారు. వీరి నిరసనకు స్థానిక ప్రజలు మద్దతు తెలపడం విశేషం.

రాజన్న క్షేత్రంలో సినీనటుల మొక్కులు



రాజన్నను దర్శించుకున్న సినీ నటులు రవి, రామ్మోహన్

వేములవాడ టౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీక మాసం సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం సినీ నటులు రచ్చ రవి, రామ్మోహన్‌లు స్వామివారిని దర్శించుకున్నారు. దర్శకులు బోయపాటి శ్రీను అఖండ-2 చిత్రంలో నటిస్తున్న రచ్చ రవి, రామ్మోహన్ దంపతులు, వారాల దేవయ్యలు భీమన్నను దర్శించుకొని మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా వీరికి ఆలయ అర్చకులు స్వామివారి ప్రసాదం అందజేశారు.

గురుదేవోభవ నేషనల్ అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న స్వరాజ్యలక్ష్మి

చందుర్తి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండలం తిమ్మాపూర్ ఎంపీపీఎస్‌కు చెందిన ఉపాధ్యాయురాలు స్వరాజ్యలక్ష్మి గురుదేవోభవ నేషనల్ అవార్డును ఆదివారం అందుకున్నారు. హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం 5అక్టోబరు 2025కు సంబంధించిన అవార్డును హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ చేతుల మీదుగా అందుకున్నారు. అవార్డు అందుకున్న రాజ్యలక్ష్మిని మండలంలోని ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభినందించారు.

ఆలయాల్లో భక్తుల కార్తీక పూజలు



వేములవాడ రాజరాజేశ్వరాలయంలో భక్తులు



రావిచెట్టు వద్ద కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

వేములవాడ టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో భక్తజన సందడి నెలకొంది. కార్తీకమాసం సందర్భంగా రెండు రోజులు సెలవు రావడంతో ఆదివారం వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. ముందుగా రాజరాజేశ్వరస్వామి వారిని భక్తులు లఘు దర్శనం చేసుకున్నారు. అనంతరం భీమేశ్వరాలయంలో భక్తులు కోడెల మొక్కులు చెల్లించి అన్నపూజ, అభిషేకం పూజలు చేశారు. నిత్యాన్నదాన సత్రంపై నిత్యకళ్యాణం, సత్యనారాయణ వ్రతాలు చేయించుకున్నారు. దీంతో రాజరాజేశ్వరాలయం, భీమేశ్వరాలయంలో భక్త జనసంద్రమైంది.

బద్దిపోచమ్మకు బోనాలు

రాజన్న సన్నిధిలో స్వామివారి దర్శించుకున్న భక్తులు బద్దిపోచమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆదివారం బద్దిపోచమ్మ ఆలయంలో అమ్మవారికి బోనం మొక్కులు చెల్లించేందుకు బారులుతీరారు. ఆలయంలో వేలాదిమంది భక్తులతో రద్దీ ఏర్పడింది.

కార్తీక దీపాలు వెలిగించిన భక్తులు

వేములవాడ రాజరాజేశ్వరాలయం ఆవరణలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయ ఎదురుగా ఉన్న రావిచెట్టు వద్ద భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించారు. మరోవైపు భీమేశ్వరాలయంలోనూ భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయంలో కార్తీక దీపోత్సవంలో భాగంగా సుహాసినులు దీపాలు వెలిగించారు.

ధర్మపురి క్షేత్రంలో...

ధర్మపురి : కార్తీక మాసం సందర్భంగా ధర్మపురి క్షేత్రంలో ఆదివారం భక్త జన సందడి నెలకొంది. దీంతో క్షేత్రంలోని లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు క్యూలైన్‌లో నిలబడి స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. ఆలయం ఆవరణలో గల ఉసిరిక చెట్టు చుట్టు ప్రదక్షిణలు చేసి కార్తీక దామోదరుడిని పూజించారు. మహిళలు దీపాలు, వత్తులు వెలిగించి భక్తిశ్రద్ధలతో పూజించారు. ఆలయం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, అర్చకులు, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు.

● కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో గోదావరి హారతి 19వ రోజు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



ధర్మపురిలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



గోదావరి నది వద్ద మహాహారతి పూజలు

ధర్మపురిలో వైభవంగా గోదావరి మహా హారతి

ధర్మపురి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో గోదావరి మహాహారతి కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ధర్మపురి క్షేత్రంలో 14వ సారి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి భాగ్యనగర్ బర్దీపూర్ శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమ పీఠాధిపతులు అవధూతగిరి మహారాజ్, పీఠాధిపతులు మహామండలేశ్వర్ డాక్టర్ సిద్దేశ్వరానందగిరి మహారాజ్, గోదావరి మహా హారతి ఉత్సవ సమితి వ్యవస్థాపక చైర్మన్ పోల్సాని మురళీధర్‌రావు వేద పండితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోదావరి నదికి పూజలు నిర్వహించారు. మహిళలు, యువతులు, విద్యార్థినులు దీపాలను నదిలో వదిలారు. భక్తులు హారతి కార్యక్రమాన్ని తిలకించారు. అంతకు ముందు దత్తగిరి మహారాజ్ ఆశ్రమ పీఠాధిపతులు అవధూతగిరి మహారాజ్, సిద్దేశ్వరానందగిరి మహారాజ్, పొల్సానీ మురళీధర్‌రావు నదుల ఆరాధన ద్వారా లభించే సత్ఫలితాలు, హిందుత్వం, ధర్మ పరిరక్షణ, ప్రాచీన సంస్కృతి గురించి ధార్మిక ప్రసంగం చేశారు. రిటైర్డ్ డీఈఈ రతన్‌లాల్ ఆధ్వర్యంలో చిన్నారులచే నిర్వహించబడిన పేరిణి, ఆంధ్ర నాట్యం ఎంతో ఆకట్టుకుంది. కార్యక్రమంలో గోదావరి హారతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగంపెల్లి వీరగోపాల్, దామెర రాంసుధాకర్‌రావు, బల్లూరి సంతోష్‌రావు, క్యాతం వెంకటరమణ, పాపారావు, సాయిరెడ్డి, పెండ్యాల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారుల నృత్య ప్రదర్శన

ఉచిత షుగర్ పరీక్షలు

రాయికల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూటపెల్లిలో ఆదివారం రాయికల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సుమారు 95 మందికి పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డయాబెటిక్ కో ఆర్డినేటర్ బత్తిని భూమయ్య, డీసీ మేకల రమేష్, అధ్యక్షుడు కొత్తపల్లి రంజిత్ కుమార్, క్యాషియర్ బెక్కం తిరుపతి, ల్యాబ్ టెక్నీషియన్ మోసారపు సంతోష్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కొడిమ్యాల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడూర్ గ్రామ శివారులో నిర్మిస్తున్న రామాలయం నిర్మాణానికి ఆదివారం దాతలు విరాళాలు అందించారు. మండల కేంద్రంలోని వెంట సాయి ట్రేడర్స్ యజమాని సురేష్ 25,116 రూపాయలు అందించారు. కొడిమ్యాల మాజీ ఎంపీటీసీ సభ్యురాలు జమాలుపూరి రాజేశ్వరీ రాజేందర్, అకిని రవళిఅశోక్, మంచాల ప్రేమల శ్రీనివాస్, నలువాల విజయ చిన్న గంగారెడ్డి, నందగిరి శ్రీనిధిమహేష్‌రెడ్డి, నలువాల రమపెద్దగంగారెడ్డి తలా 11,116 రూపాయలు అందించారు. విరాళం అందించిన దాతలకు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

నత్తనడకన ధాన్యం కొనుగోళ్లు

● రంగు మారిందంటూ తూకంలో జాప్యం

● రోజుల తరబడి రైతుల పడిగాపులు

మల్యాల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వర్షాలకు ధాన్యం కాపాడుకోవడానికి రైతులు అనేక పాట్లు పడి విక్రయానికి సిద్ధం చేస్తే రంగు మారిందంటూ కొందరు రైసుమిల్లర్లు కొర్రీలు పెట్టడం అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తోంది. మండలంలో నెల రోజుల క్రితమే వరి కోతలు ప్రారంభం అయ్యాయి. నిత్యం వర్షాలతో రైతులు అనేక పాట్లు పడగా పది రోజుల క్రితం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం అయ్యాయి. అయితే కేంద్రాలు ప్రారంభం అయినా తూకం చేపట్టకపోగా రెండు రోజులుగా ధాన్యం తరలిస్తున్నారు. అక్కడ మిల్లర్లు రంగు మారందని, ధాన్యం నలుపు రంగులోకి వచ్చిందంటూ తీసుకోకపోవడంతో నిర్వాహకులు, రైతులు తలలు పట్టుకుంటున్నారు. నెలరోజుల తరువాత ధాన్యం తరలిస్తే కొర్రీలు పెట్టడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రంగు మారిన ధాన్యం తీసుకోవాలంటే సంచికి 43 కిలోలు ఉండాల్సిందేనని తేల్చి చెబుతున్నారని ఇలాగైతే తాము తీవ్రంగా నష్ట పోవాల్సివస్తుందని వాపోతున్నారు. ప్రారంభ దశలోనే కొర్రీలు పెడితే కొనుగోలు పూర్తి అయ్యేవరకు ఇంకెంత ఇబ్బంది పడాల్సి వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు.




మల్యాలలోని కొనుగోలు కేంద్రంలోని ధాన్యం కుప్పలు, ధాన్యం ఆరబోస్తున్న రైతులు

● త్వరగా తూకం అయ్యేలా..

మండల వ్యాప్తంగా సహకార సంఘాలు, సెర్ప్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించగా ఒక్కో కేంద్రం నుంచి ఇప్పటి వరకు కనీసం రెండు లారీల ధాన్యం కూడా తరలలేదని తెలుస్తోంది. ఇటీవల పోతారంలో అక్కడి రైతులు ధర్నాలకు సిద్ధం అయితే అధికారులు ఆఘమేఘాల మీద అప్పడికప్పుడు తూకం ప్రారంభించారని, మిగితా చోట్ల దాదాపుగా అదే పరిస్థితులు ఉన్నాయని, వర్షాలు వస్తే పరిస్థితి మళ్లీ మొదటికొస్తుందని రైతులు పేర్కొంటున్నారు. అయితే మిల్లర్ల కేటాయింపు, కొర్రీలు పెడుతూ ధాన్యం తీసుకోకపోవడంతో ధాన్యం తూకం ఆలస్యం అవుతున్నట్లు నిర్వహకులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు త్వరగా తూకం అయ్యేలా చర్యలు తీసుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

● ఇరవై రోజులుగా ఆరబెడుతున్నా..

మల్లయ్య, రైతు, గుడిపేట



ఇరవై రోజుల క్రితం ధాన్యంను మల్యాల క్రాస్ రోడ్డు వరద కాలువ వద్ద గల కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన. ఇప్పటికి తూకం కాలేదు. మొదట్లో తేమ శాతం వచ్చిందని చెప్పి, మరో మిషన్ తీసుకువచ్చి తేమ శాతం రాలేందని తూకం వేయలేదు. దీంతో నిత్యం ధాన్యం ఆరబెట్టిన. తేమశాతం వచ్చినా తూకం వేయడం లేదు.

పరిహారం అందేనా?

(5వ పేజీ తరువాయి..)



సారంగపూర్‌లో నేల వాలిన వరి(ఫైల్)

కోరుట్లలో 15 గ్రామాల్లో 1,612 మంది రైతులకు చెందిన 2,201 ఎకరాలు, మల్లాపూర్‌లో 20 గ్రామాల్లో 949 మంది రైతులకు చెందిన 1,046 ఎకరాలు, కథలాపూర్‌లో 19 గ్రామాల్లో 3,148 మంది రైతులకు చెందిన 2,934 ఎకరాలు, మెట్‌పల్లిలో 19 గ్రామాల్లో 1,935 మంది రైతులకు చెందిన 1,570 ఎకరాలు, ఇబ్రహీంపట్నంలో 16 గ్రామాల్లో 1,326 మంది రైతులకు చెందిన 991 ఎకరాలు, సారంగపూర్‌లో ఐదు గ్రామాల్లో 30 మంది రైతులకు చెందిన 80 ఎకరాలు, బుగ్గారంలో 10 గ్రామాల్లో 542 మంది రైతులకు చెందిన 635 ఎకరాలు, ఎండపల్లిలో 13 గ్రామాల్లో 1,250 మంది రైతులకు చెందిన 1,619 ఎకరాలలో వరిపంట నష్టానికి గురైనట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమిక సర్వేలో తేల్చారు.

● 1,146 ఎకరాల్లో పత్తి పంట నష్టం..

కాగా జిల్లాలో 1,066 మంది రైతులకు చెందిన 1,146 ఎకరాల్లో పత్తి పంట దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమిక సర్వేలో తేల్చారు. జిల్లాలో ఎండపల్లి మండలంలో 13 గ్రామాల్లో 572 మంది రైతులకు చెందిన 500 ఎకరాలు, బుగ్గారం మండలంలోని 10 గ్రామాల్లో 331 మంది రైతులకు చెందిన 372 ఎకరాలు, వెల్గటూరు మండలంలో 163 మంది రైతులకు చెందిన 274 ఎకరాల్లో పత్తి పంట నష్టానికి గురైనట్లు అధికారులు గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపారు.

● ముంచుతున్న అధిక వర్షాలు..

రెండు, మూడేళ్లుగా వర్షాలు ఏ సమయంలో వస్తున్నాయో అర్థంకాని పరిస్థితి నెలకొంది. వానాకాలం సీజన్ ప్రారంభంలో కనీసం సాధారణ వర్షాలు కూడా నమోదు కావడం లేదు. తదనంతరం పంటలు చేతికి వచ్చే సమయంలో అధిక వర్షాలు కురిసి అన్నదాతలు నష్టపోయేలా చేస్తున్నాయి. 2024-25 వానాకాలం సెప్టెంబరులో కురిసిన వర్షాలకు జిల్లాలో 17,982 ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఎకరానికి రూ. 10 వేల పరిహారం ఇస్తామని చెప్పి 33 శాతానికి మించి నష్టం జరిగితేనే అన్న నిబంధన పెట్టారు. అంతకు ముందు 2023 ఏప్రిల్ మాసంలో పంట నష్టం జరిగినట్లు అంచాన వేసినప్పటికీ పైసా పరిహారం అందలేదు. 2023 యాసంగి సీజన్‌లో జిల్లాలో 26,199 ఎకరాల్లో పంటలు నష్టపోతే కేవలం 532 ఎకరాలకు మాత్రమే పరిహారం అందిందని అన్నదాతలు అంటున్నారు. 2025-26 వానాకాలం సీజన్‌లో తుఫాను ప్రభావంతో పెద్దఎత్తున రైతులు పంటలను నష్టపోవాల్సి వచ్చింది. ఓ వైపు కోతలు ప్రారంభమైన తర్వాత మొంథా తుపాను పలు పంటలకు నష్టాన్ని మిగిల్చింది. ఈనష్టాన్ని ప్రాథమికంగా అంచనా వేయగా... 33 శాతం నష్టం జరిగిన పంట లెక్కలు తేల్చే పనుల్లో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. ఇలా ఏటా ఏదోవిధంగా పంటను నష్టపోయినా పరిహారం అందక రైతులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో పంటలు నష్టపోయిన వారికి ఎంతో కొంత పరిహారం ఇప్పించాలని రైతులు కోరుతున్నారు.

పరిహారం అందించాలి..

- రాజేశుని భూమారెడ్డి, రైతు, తిమ్మాపూర్



ఇటీవల మొంథా తుపాను ప్రభావంతో కురిసిన వర్షాల వల్ల పంట నష్టం జరిగింది. ఈదురు గాలులు, వడగళ్ల కారణంగా పంట చేతికి రాకుండా పోయింది. బీమా పథకాలు లేకపోవడంతో పరిహారం అందడం లేదు. ప్రభుత్వం ప్రకటించిన రూ. 10వేల నష్ట పరిహారం అందించాలి.

పంటంతా వర్షం పాలైంది..

- కొమ్ము కొమురయ్య, రైతు, బట్టపల్లి



కోతకొచ్చిన వరి పొలం మొంథా తుపాను కారణంగా కురిసిన వర్షాలకు నేల వాలింది. నీరంతా పొలం గుండానే వెళ్లింది. పరిహారం ఇస్తే పెట్టుబడిలో కొంతైనా వస్తోంది. ప్రభుత్వం ప్రకటించిన పంట నష్ట పరిహారం అందించాలి.

ఎమ్మెల్యే వైఖరిని స్పష్టం చేయాలి

- మాజీ మంత్రి జీవన్ రెడ్డి

జగిత్యాల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలో వంద కోట్ల ప్రభుత్వ భూమి కబ్జా విషయంలో స్థానిక ఎమ్మెల్యే ఎటు వైపు ఉన్నారో స్పష్టం చేయాలని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగిత్యాల పట్టణంలోని 138 సర్వే నంబర్‌లో కోట్లాది రూపాయల విలువైన 20 గుంటల స్థలం కబ్జాకు గురైందని అన్ని రుజువులతో బయట పెట్టిన నేపథ్యంలో ఎమ్మెల్యే అక్రమార్కులకు అండగా నిలిచారని విమర్శించారు.

వంద కోట్ల రూపాయల విలువైన ప్రజా సొమ్ము అన్యాక్రాంతం అయిందని పోరాటం చేస్తున్న నేపథ్యంలో దానిపై కలెక్టర్ విచారణకు ఆదేశించారని, ఈ నేపథ్యంలో విచారణను నీరుగార్చే విధంగా ఎమ్మెల్యే వైఖరి ఉందని స్పష్టం చేశారు. మున్సిపాలిటీ డీజిల్, పెట్రోల్ అవుట్ లెట్ కోసం కేటాయించిన స్థలం వాణిజ్య అవసరాలకు వినియోగించడంతో పాటు వారసత్వపు ఆస్థిగా పంచుకుని అమ్మి వేశారని ఆరోపించారు. అక్రమ నిర్మాణాలకు అనుమతి ఇచ్చిన మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యాజమాన్యపు హక్కులు లేకుండా అనుమతులు ఎలా ఇచ్చారని అన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి బండ శంకర్, గాజుల రాజేందర్, కండ్లపెల్లి దుర్గయ్య, శీలం సురేందర్, జంగిలి అనిల్, నెహాల్, గుండా మధు, బీరం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా నియోజకవర్గంలోని అనేక ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేశామని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణంలోని వాసవి మాత భక్తులు ఆధ్యాత్మిక కుటుంబం ధర్మశాల దగ్గర నుంచి పెంబట్ల వాసవి మాతా ఆలయానికి చేపట్టిన పాద యాత్రను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని వైశ్య సంఘం అభివృద్ధికి నిధులు మంజూరు చేశానని అన్నారు. ప్రపంచంలోనే అత్యధిక యువశక్తి భారతదేశంలోనే ఉందని, యువత దేశానికి వెన్నెముక అన్నారు. యువకులు చెడు అలవాట్లకు బానిసకాకుండా సరైన మార్గాన్ని ఎంచుకోవాలని అన్నారు. భక్తి భావనతో మానసిక ప్రశాంతత కలుగుతందని, ప్రజలు భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జుంబర్తి రాజ్ కుమార్, కోటేశ్వర్ రావు, చంద్రమౌళి, అర్వపెల్లి శ్రీనివాస్, సురేష్ వాసవి మాత భక్తులు పాల్గొన్నారు.



జెండా ఊపి యాత్ర ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కీర్తిచక్ర పురస్కారం అందుకున్న ఉపాధ్యాయురాలు



అవార్డు అందుకుంటున్న సరోజన

జగిత్యాలరూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కీర్తిచక్ర పురస్కారాన్ని లక్ష్మీపూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న మద్దెల సరోజన అందుకున్నారు. సాహితి సేవారంగంలో, వివిధ కవితల పోటీల్లో పాల్గొని అత్యుత్తమ కవితలు రాసి సరోజన ప్రతిభను చాటారు. శ్రీగౌతమేశ్వర సాహితీ కళా సేవా సంస్థ, శ్రీ ఆర్యాణి సకల కళావేదిక సంయుక్తంగా విశిష్టసేవలను అందించిన వారిని గుర్తించి ఈ అవార్డును కరీంనగర్ ఫిల్మ్‌భవన్‌లో ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

డాక్టరేట్ ఎంపికైన మహేష్‌కు సన్మానం

కోరుట్ల రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన అనుమల్ల మహేష్ ను ఆదివారం గ్రామస్థులు సన్మానించి అభి నందించారు. మహేష్ హైదరాబాదులోని ఉస్మానియా యునివర్సిటీలో పరిశోధనా గ్రంథాన్ని సమర్పించి డాక్టరేట్‌కు అందుకున్నాడు. మహేష్ గ్రామానికి మొదటిసారి రావడంతో గ్రామస్థులు సన్మానించారు. మాజీ సర్పంచ్ శారద-లింగారెడ్డి, నరేందర్, సల్ల లింగారెడ్డి, ఎండి రాహేత్ పాషా, గందె నవీన్, బండ్ల అర్వింద్, ఓరుగంటి సతీష్, తోట శేఖర్, వినయ్ పాల్గొన్నారు.

మిత్రుల కుటుంబానికి పూర్వ విద్యార్థుల అండ

వెల్గటూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కష్టాల్లో ఉన్న మిత్రురాలికి అండగా నిలిచి ఆమెకు మేమున్నామనే భరోసా నింపి స్నేహమేరా జీవితం స్నేహమేరా శాశ్వతం అనిపించారు పదో తరగతి మిత్రబృదం. స్నేహానికి నిలువెత్తు నిదర్శనంగా పదో తరగతి స్నేహితుల బృందం నిలిచింది. కప్పారావుపేట్ గ్రామానికి చెందిన దమ్మ మమత భర్త రమేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. పెద్ద దిక్కును కోల్పోయి తీవ్ర కష్టాల్లో ఉన్న తమ పాత మిత్రురాలి కుటుంబానికి అండగా నిలిచారు 2005-06బ్యాచ్ పదో తరగతి మిత్ర బృందం. తమ శక్తి మేర ఆర్థిక సాయం అందించారు. దుఃఖంలో ఉన్న తమ స్నేహితురాలికి ధైర్యం చెప్పడమే కాకుండా, వారు ఆమె కూతురు భవిష్యత్తు కోసం స్నేహితులందరూ కలిసి రూ.27 వేలు విరాళాలు సేకరించి బ్యాంక్‌లో ఫిక్స్ డిపాజిట్ చేసి ఆమె అందజేశారు. కార్యక్రమంలో గాజుల రవి, నక్క సురేష్, తరాల అశోక్, మూగల సంతోష్, వేముల పరమేష్, తరాల శిరీష పాల్గొన్నారు.




వెల్గటూర్, రాయికల్‌లో బాధిత కుటుంబసభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న మిత్రులు

రాయికల్: రాయికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తమతో పాటు కలిసి చదువుకున్న మిత్రుని కుటుంబానికి తోటి స్నేహితులు ఆర్థిక సహాయం అందించారు. రాయికల్ పట్టణానికి చెందిన బూరుగుల రాజేందర్ కిడ్నీ వ్యాధితో బాధ పడుతూ అకాల మరణం చెందాడు. విషయం తెలుసుకున్న 1990-91 బ్యాచ్ పూర్వ విద్యార్థులు రాజేందర్ కుటుంబానికి రూ.32 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే తన కుమారుడు శ్రీకేష్ పై చదువుల కోసం కూడా తమవంతుగా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాసం వెంకటేశం, కొయ్యడి శ్రీనివాస్, బాలగంగాధర్, కుంబాల శ్రీనివాస్ రెడ్డి, రాచర్ల చంద్రశేఖర్, సిద్ధంశెట్టి శ్రీనివాస్, శివనీటి కిష్టయ్య, సుందరగిరి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

తరగతులు ఐదు.. విద్యార్థులు ఆరుగురు

- తరగతి గది ఒకటి

కొడిమ్యాల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఐదు తరగతులకు ఒక గది, ఆరుగురు విద్యార్థులకు ఐదు తరగతులు, ఒకగది, ఒక ఉపాధ్యాయుడు ఉన్నారు. 1వ తరగతిలో విద్యార్థులు లేరు. 2వ తరగతిలో హరిణి, 3వ తరగగతిలో ఎస్. సాయినక్షత్ర, బి. చైత్ర, 4వ తరగతిలో డి. నేహ, 5వ తరగతిలో ఒక బాలుడు ఎం. వరుణ్‌తేజ విద్యను అభ్యసిస్తున్నారు. ఇందిరానగర్ కాలనీలో ఐదో తరగతి వరకు చదువుకునే 10మంది విద్యార్థులు ఉండగా మిగతా ఐదుగురు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశా లకు వెళ్తారని కాలనీ వాసులు తెలిపారు. ఈ పాఠశాలకు వంట గది, మధ్యాహ్న భోజనం నిర్వహిస్తున్నట్లు డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు ఎర్రోజు మొహనాచారి తెలిపాడు.



విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌దే విజయం

కథలాపూర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్ విజయం తథ్యమని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లో ప్రచారం చివరి రోజు కావడంతో 75వ బూత్‌లో విస్తృత పర్యటన చేసిన అనంతరం కాంగ్రెస్ శ్రేణులతో కలిసి సమీక్ష నిర్వహించారు. జూబ్లీహిల్స్ ప్రజానీకం కాంగ్రెస్ అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధికి పట్టం కట్టబోతున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజాపాలన రెండేళ్లలో ఎంతో ప్రగతి పథంలో కొనసాగుతున్న విషయాన్ని ఇంటింటికీ ఓటర్లకు వివరించామన్నారు. ఈ సందర్భంగా పీసీసీ కార్యవర్గ సభ్యులు తొట్ల అంజయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, బైర దేవ్ యాదవ్, జిల్లా కార్యదర్శి ధనుంజయ్‌రెడ్డి, న్యావనంది శేఖర్, అల్లకొండ లింగంగౌడ్ తదితరులు ఉన్నారు.

పెగడపల్లి: జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో ఆదివారం పెగడపల్లి మండల కాంగ్రెస్ శ్రేణులు పాల్గొని ప్రచారం నిర్వహించారు. స్థానిక శాసనసభ్యుడు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలసి ఆదివారం జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని సోమాజీగూడ, ఎల్లారెడ్డిగూడ, అంబేద్కర్ కాలనీలో ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ అభ్యర్థికి చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ బుర్ర రాములుగౌడ్, మాజీ మార్కెట్ చైర్మన్ ఒరుగల శ్రీనివాస్, నాయకులు సురకంటి సత్తిరెడ్డి, విజయభాస్కర్, రాజ్ కుమార్, శ్యాంసుందర్‌రెడ్డి, పవన్‌రెడ్డి, విక్రమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దీపోత్సవం

గంగాధర, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాచిరెడ్డిపల్లి కొచ్చగుట్ట మల్లికార్జునస్వామి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని దీపోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వామికి మహాభిషేకం నిర్వహించారు. అనంతరం వెయ్యి ఒక్క దీపాలతో ప్రత్యేకంగా లింగాకార రూపంలో వెలిగించి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

గీతా సత్సంగం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు

మెట్‌పల్లి టౌన్, నవంబరు9(ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి గీతా సత్సంగ్ ఆధ్వర్యంలో ఆదివారం తడపాకల్ గోదావరి గంగా స్నానాలు, కార్తీక దీపాలు, దీప దానాలు, విష్ణు సహస్ర నామ పారాయణం, భగవద్గీత పారాయణం, భజనలు, భక్తి పాటలు, తాంబోలా కార్యక్రమాలను పలువురు బృందం భక్తులు నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గీతా సత్సంగ్ వ్యవస్థాపకులు చీలమంతుల చత్రపతి, సభ్యులు మహాజన్ హరీష్, గాదె రమేష్, వెంకటేశ్వర్, అల్లకట్టు సత్యనారాయణ, అల్లకట్టు విజయ్‌కుమార్, గంగాధర్, గోలి శ్రీధర్, రవి, జ్యోతి, సంతోషిని, లక్ష్మి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చెరువు మత్తడి పక్కనే ఇంటి నిర్మాణం



నిర్మాణంలో ఉన్న ఇల్లు

మల్యాల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండల కేంద్రంలోని బ్లాక్ చౌరస్తా నుంచి ముత్యంపేటకు వెళ్లే మార్గంలో చెరువు మత్తడి పక్కనే ఇంటి నిర్మాణం సాగుతోంది. సమీపంలోనే బీమన్న చెరువు ఉండగా దాని మత్తడి నూతన ఇంటి నిర్మాణం పక్కనే ఉంది. దాదాపుగా మత్తడిని ఆనుకొని రెండు, మూడు మీటర్ల దూరంలోనే ఇళ్లు నిర్మిస్తుండగా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దాదాపుగా చెరువులలో నీరు నిలిచే ప్రాంతం ఎఫ్‌టీఎల్‌లో ఉంటుండగా ఎఫ్‌టీఎల్ తరువాత నీరు తగ్గిన్నపుడు బఫర్‌జోన్‌గా పరిగణిస్తారు. అయితే ఇక్కడ మత్తడి పక్కనే ఇంటి నిర్మాణం కొనసాగడం, ఎఫ్‌టీఎల్‌లో నిర్మిస్తున్నారని కొందరు నెల రోజుల క్రితం ప్రజావాణీలో ఫిర్యాదు చేశారు. దీంతో ఇరిగేషన్ అధికారులు పంచాయితీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పూర్తి స్థాయిలో పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరు తున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ ఏఈ శ్రీకాంత్‌ను సంప్రదించగా తాము పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పనులు నిలిపివేయాలని కోరడం జరిగిం దన్నారు. మల్యాల పంచా యతీ ఈవో శ్రీకాంత్‌ను వివరణ కోరగా పనులు నిలిపివేయాలని నోటీసులు జారీ చేశామని, యజమాని అందుబాటులో లేకపోవడంతో గోడకు అతికించినట్లు ఆయన తెలిపారు.



ఇంటి నిర్మాణం పక్కనే గల చెరువు మత్తడి

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

- సీసీ రోడ్లు...

వరద కాల్వల నిర్మాణానికి ప్రణాళిక

కోరుట్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కొన్ని సంవత్సరాలుగా నిధులు మంజూరు కాక పట్టణంలోని వార్డులలో అంతర్గత రహదారులు, మురికి కాల్వలు అభివృద్ధి నోచుకోలేదు. చిన్న వర్షం పడినా లోతట్టు ప్రాంతాల్లో రోడ్డుపై వర్షం నీరు ప్రవహిస్తుడంతో కాలనీ వాసుల బయటకు రాడానికి జంకుతుంటారు. పట్టణంలోని అంతర్గత రహదారులు, మురుగు, వరద కాల్వ నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 18.70 కోట్ల నిధులను మంజూరు చేసింది. దీంతో మున్సిపల్ అధికారులు ప్రణాళికలను సిద్ధం చేసి ఆమోదం కోసం ఉన్నత అధికారులకు నివేదించారు. కోరుట్ల బల్దియా అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ (యూఐడీఎఫ్) పథకం కింద రూ. 18.70 కోట్లు మంజూరు కాగా ఇందులో నేషనల్ హౌసింగ్ బ్యాంక్ (ఎన్‌హెచ్‌ఎం) వాటా రూ. 15 కోట్లను, రాష్ట్ర ప్రభుత్వం రూ. 3.70 కోట్లను కేటాయించింది. నిధులతో పనులను చేపట్టేందుకు త్వరలో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించనున్నారు.



కోరుట్ల మున్సిపల్ కార్యాలయం

అభివృద్ధి పనుల ప్రతిపాదనలు ఇలా..

- రూ. 2.70 కోట్ల నిధులతో మద్దుల చెరువు నుంచి ప్రకాశం రోడ్డు మీదుగా కల్లూర్ రోడ్డు వరకు వరద నీటి కాలువ నిర్మాణం.
- రూ. 1.50 కోట్ల నిధులతో అష్టలక్ష్మి దేవాలయ నుంచి మద్దుల చెరువు వరకు వదర నీటి కాలువ నిర్మాణం.
- రూ 1.50 కోట్లతో లయన్స్ క్లబ్ వాటర్ ప్లాంట్ నుంచి మద్దుల చెరువు వరకు వరుద నీటి కాలువ నిర్మాణం.
- రూ. 40 లక్షల నిధులతో బిలాల్‌పుర నుంచి వేములవాడ రోడ్డు వరకు వరద నీటి కాలువ నిర్మాణం.
- రూ. 50 లక్షల నిధులతో దేశాయినగర్ నుంచి సురేఖ నర్సింగ్ హోం వరద నీటి కాలువ నిర్మాణం. విద్యుత్ స్థంబాల ఏర్పాటు.
- రూ. 45 లక్షలతో నిధులతో 63 జాతీయ రహదారి నుంచి వినోభా రోడ్డు శ్రీనివాస్ రోడ్డులో సీసీ రోడ్డు నిర్మాణం.
- రూ. 50 లక్షల నిధులతో జాతీయ రహదారి నుంచి ప్రకాశం రోడ్డులో ఓ కల్యాణ భవనం వరకు సీసీ రోడ్డు నిర్మాణం.
- రూ. 35 లక్షల నిధులతో బస్టాండ్ నుంచి బీముని దుబ్బ మసీద్ వరకు సీసీ రోడ్డు నిర్మాణం.
- రూ. 8.45 కోట్లతో 33 వార్డులో సీసీ, తారు రోడ్డు, మురికి కాల్వ, కల్వర్టుల నిర్మాణం.
- రెండుకోట్ల నిధులతో ఉద్యానవనం ఏర్పాట్లు
- రూ. 20 లక్షల నిధులతో కొత్త బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ కూడలి అభివృద్ధి
- రూ. 15 లక్షల నిధులతో మహాలక్ష్మి దేవాలయం వరకు రోడ్డు నిర్మాణం, వాగు వద్ద రూ. 15లక్షలతో కల్వర్టు నిర్మాణం.



ప్రకాశం రోడ్డులో సీసీ రోడ్డు నిర్మాణం చేసే రహదారి